

నేడు అంతర వర్సిటీ కబడ్డీ క్రీడాకారిణుల ఎంపిక

ఎచ్చెర్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ తరఫున అంతర యూనివర్సిటీ పోటీల్లో కబడ్డీ క్రీడాకారిణుల ఎంపిక ప్రక్రియను వర్సిటీలో శుక్రవారం నిర్వహించనున్నట్టు స్పోర్ట్స్ డీన్ డాక్టర్ పి.రవికుమార్ తెలిపారు. 'వర్సిటీ, అనుబంధ కళాశాలలకు చెందిన ఆసక్తి గల విద్యార్థినులు ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనాలి. జూలై 1, 2000 తర్వాత జన్మించిన విద్యార్థినులు పాల్గొనేందుకు అర్హులు. పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో, సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువీకరించిన పత్రంతో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హాజరుకావాల'ని ఆయన సూచించారు.



డీజే.. అలజడి

- పండుగలు, శుభకార్యాల పేరిట ఇష్టారాజ్యంగా శబ్దాలు
- భారీ ధ్వనులతో ప్రజలకు ముప్పు
- పరిమితికి మించితే అనర్థాలు తప్పవని నిపుణుల హెచ్చరిక

నరసన్నపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వివాహాలు, పండుగలతోపాటు ఏ శుభకార్యమైనా చాలు.. డీజే శబ్దాల మోత మోగుతోంది. పరిమితికి మించిన అతి ధ్వనులతో అనర్థాలు చోటుచేసుకుంటున్నాయి. శబ్దాల మోత తట్టుకోలేక కొంతమంది గుండెపోటుతో మరణించిన సంఘటనలూ ఉన్నాయి. ఊరేగింపుల సమయంలో డ్యాన్సులు చేస్తూ కొందరు యువకులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ పలుచోట్ల చోటుచేసుకున్నాయి. తాజాగా బుధవారం అర్ధరాత్రి నరసన్నపేట పట్టణం భవానీపురంలో నందెన్న ఊరేగింపు ఉత్సవాల్లో భాగంగా డీజే ఏర్పాటు చేయగా.. ఆ శబ్దాలకు శిథిలావస్థలో ఉన్న ఓ భవనం పోర్టికో కూలిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నా డీజేల ఏర్పాటుపై కొంతమంది యువకులు వెనక్కి తగ్గకపోవడం గమనార్హం. డీజే శబ్దాల రోతకు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. శబ్దం తీవ్రత పెరిగే కొలదీ రుగ్మతలు ఖాయమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వినికిడిలోపంతోపాటు మానసిక వ్యాధులు కలుగుతాయని పేర్కొంటున్నారు. రక్తపోటు పెరిగి వికారం, బ్రెయిన్‌స్ట్రోక్, గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని స్పష్టం చేస్తున్నారు. అధిక శబ్దాలతో పర్యావరణం కాలుష్యమై నష్టాలు జరిగే అవకాశం ఉందని పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు తెలిపారు.

- కాలుష్య నియంత్రణ మండలి

(మిగతా 4వ పేజీలో..)



భవానీపురంలో శిథిలమైన భవనాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ లక్ష్మణరావు, ఆర్‌అండ్‌బీ, పీసీబీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు

భవనం పోర్టికో వ్యవహారంపై విచారణ

- ప్రభుత్వానికి సమగ్ర నివేదిక: తహసీల్దార్
- క్షతగాత్రులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పరామర్శ

4లో

సచివాలయ ఉద్యోగులకు శుభవార్త

- పదోన్నతులకు మంత్రివర్గ ఉపసంఘం
- ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

మెళియాపుట్టి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు దీపావళికి ముందే రాష్ట్ర ప్రభుత్వం కానుక ప్రకటించింది. కొత్త పోస్టులతో పాటు పే స్కేల్ నిర్ణయించాలని, సచివాలయ ఉద్యోగుల పదోన్నతులపై అధ్యయనం చేయాలని సబ్‌కమిటీని ఆదేశించింది. పదోన్నతుల తర్వాత ఖాళీల భర్తీపైనా చర్చించి నివేదిక ఇవ్వాలని సూచించింది. ఈమేరకు ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 647 గ్రామ, 85 వార్డు సచివాలయాలు మొత్తంగా 752 ఉన్నాయి. వీటిలో 6,868 మంది ఉద్యోగులకుగానూ ప్రస్తుతం 6,034 మంది మాత్రమే ఉన్నారు. వీరికి జాబ్‌చార్ట్ సక్రమంగా అమలు చేయకపోవడంతో కొంతమందిపై పని ఒత్తిడి పడుతోంది. మరికొంతమందికి పని లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం సచివాలయాల ప్రక్షాళనకు చర్యలు చేపడుతోంది. జనాభా ప్రాతిపదికన గ్రేడ్‌లుగా విభజిస్తోంది. ఐదేళ్ల ఒకే సచివాలయంలో పనిచేసినవారిని ఇతర మండలాలకు బదిలీ చేసింది. ఇటీవల సీఎం చంద్రబాబు నాయుడు సచివాలయ ఉద్యోగుల సమస్యలను తెలుసుకునేందుకు పది మంది మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. తాజాగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పదోన్నతులపై అధ్యయనం చేయాలని ఆ కమిటీని ఆదేశించారు. ఈ మేరకు త్వరలో పదోన్నతులు కల్పించనున్నారు. ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నారు. ఇప్పటికే కొంత మంది డీఏలను పంచాయతీ కార్యదర్శులుగా నియమించారు. కాగా.. ఏఎన్ఎం, వీఏఏ, వెటర్నరీ, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులకు శాఖలు

(మిగతా 4వ పేజీలో..)

ఆనందంగా ఉంది

సచివాలయ సిబ్బంది సమస్యలు తెలుసుకోవడానికి మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. అన్ని శాఖలకు పదోన్నతి ఉన్నా.. సచివాయ ఉద్యోగులకు కొంత మంది ప్రమోషన్ చానల్ లేదు. ఉప సంఘం ఏర్పాటుతో మేలు జరుగుతుంది.

- టి.డేవిడ్, డీఏ, వసుంధర

....

టెక్నికల్ పోస్టులివ్వాలి

డీఏలుగా పనిచేస్తున్న వారిలో అధికంగా బిటెక్ చేసినవారిని తీసుకున్నారు. డీఏలకు టెక్నికల్ పోస్టులు సృష్టించి ఇస్తే సమర్థవంతగా పనిచేయగలం.

- హరీష్, డీఏ, సచివాలయ ఉద్యోగి



మర్రిపాడు సచివాలయం

నా అనేవారు లేక.. కడచూపునకు నోచుకోక



- విదేశాల్లో జిల్లావాసుల మృత్యువాత
- పట్టించుకోని కంపెనీలు, ఏజెంట్లు
- మృతదేహాలు రప్పించేందుకు ఇక్కట్లు
- కొన్నిసార్లు అక్కడే అంత్యక్రియలు



పుష్కలంగా ఉపాధి దొరుకుతుందని.. సులువుగా డబ్బులు సంపాదించ వచ్చనే ఆశతో చాలామంది యువత విదేశీ బాట పడుతున్నారు. అక్కడకు వెళ్లాక వారి కలలు కల్లలు అవుతున్నాయి. వారి ఆశలను బ్రోకర్లు, కొన్ని కంపెనీల యజమానులు చిదిమేస్తున్నారు. ఒకపని కోసం తీసుకెళ్లి మరోపని చేయిస్తున్నారు. సమయానికి తిండి ఉండదు. కంటి నిండా కునుకు ఉండదు. కష్టమొస్తే నా అనేవారు ఉండరు. ఏదైనా ఘటనలో చనిపోతే వారి మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకురావడం అంత సులు వు కాదు. అక్కడే రోజుల తరబడి ఆస్పత్రుల్లో ఉండిపోతాయి. మన నాయకులు, అధికారులు స్పందించి చర్యలు చేపడితేనే అవి ఇక్కడికి చేరుతాయి. లేదంటే కడచూపునకు కూడా నోచుకోకుండా అక్కడే అనాథ శవంగా అంత్యక్రియలు జరిగిపోతాయి.

- ఈ నెల 3న సోంపేట మండలం పాలవలసకు చెందిన తామాడ ఓంకార్ అనే యువకుడు దుబాయ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఆయన తండ్రి ఇప్పటికే చనిపోగా, తల్లితో కలిసి గ్రామంలో నివాసం ఉండేవాడు. ఉపాధి కోసం ఇటీవల దుబాయ్ వెళ్లాడు. కానీ, అక్కడ అనుకొని రీతిలో చనిపోయాడు. మృతదేహాన్ని రప్పించేందుకు తల్లి పడిన బాధ వర్ణనాతీతం.
- ఈ ఏడాది మార్చి 6న కవిటి మండలం బెలగాం గ్రామానికి చెందిన భుజంగరావు అనే వలస కూలీ ఇరాక్‌లో మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు కుటుంబసభ్యులు ఆరాటపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ చొరవతో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కృషిచేయగా.. 35 రోజుల అనంతరం మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది.

ఇచ్ఛాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):

విదేశీ ఉద్యోగాల పేరిట జరిగే మోసాలు, అక్కడకు వెళ్లిన తరువాత ఎదురయ్యే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ముఖ్యంగా వివిధ కారణాలతో చనిపోతున్న వారి మృతదేహాలను స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలామందికి అక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల నుంచి నిరుద్యోగ యువత ఎక్కువగా విదేశాలకు వెళుతుంటారు. భవన నిర్మాణంతో పాటు పరిశ్రమల్లో కార్మికులుగా పని చేస్తుంటారు. ఒక్కో గ్రామం నుంచి కనీసం 50 మంది నుంచి 200 వరకూ నిరుద్యోగ యువత విదేశీ కార్మికులుగా ఉంటారు. ముఖ్యంగా సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి మండలాల యువకులు విదేశాల్లో ఎక్కువగా ఉన్నారు. పదో తరగతి వరకూ చదవడం.. వెల్డర్, ఫిట్టర్, ఫ్యాబ్రికేటర్‌గా శిక్షణ తీసుకోవడం.. తరువాత ఉపాధి బాట పట్టడం ఉద్దానంలో పరిపాటిగా మారింది. 11 మండలాల్లో 25 నుంచి 30 వేల మంది (మిగతా 4వ పేజీలో..)

ఏదీ ట్రామా..కేర్?

- జిల్లాలో సుదీర్ఘ జాతీయ రహదారి
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- బాధితులకు సక్రమంగా అందని సేవలు
- నేడు వరల్డ్ ట్రామా డే

4లో

జీఎస్టీ 2.0 తగ్గింపు వైద్యసేవలపై అవగాహన

- ఆస్పత్రులు, ల్యాబ్‌ల్లో తగ్గిన ధరల పట్టిక ఏర్పాటు చేయాలి
- జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ అనిత

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0లో భాగంగా ఆసుపత్రుల్లో అందించే వైద్యసేవలు, మందుల ధరల్లో తగ్గింపు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్ల వారికి అవగాహన కల్పించామని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డా.కె.అనిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మందుల ధరలు 12శాతం నుంచి 5 శాతానికి తగ్గాయి. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ఆయాచోట్ల తప్పనిసరిగా తగ్గిన ధరల పట్టికను ప్రదర్శించాలని ఆదేశాలు జారీ చేశాం. జీఎస్టీ తగ్గుదల వలన వైద్యఖర్చుల భారం తగ్గింది. మరిన్ని వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామ'ని డీఎంహెచ్‌వో అనిత హెచ్చరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

5లో

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శివారు ప్రాంతాల్లో చెత్త డంప్

- వర్షాలకు కుళ్లి దుర్వాసన వెలువడుతుండడంతో అవస్థలు
- ఇదీ కేదారిపురంలో రోడ్లకు ఇరువైపులా పరిస్థితి

6లో

కారులో గంజాయి రవాణా

- 209 కేజీలు స్వాధీనం
- ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇద్దరి అరెస్టు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెద్ద మొత్తంలో గంజాయి నిల్వలు లభ్యమయ్యాయి. ఒడిశా నుంచి జిల్లా మీదుగా ఉత్తరప్రదేశ్‌కు కారులో గంజాయి అక్రమ రవాణా చేస్తూ ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. 'ఎచ్చెర్ల ఎస్‌ఐ సందీప్‌కు వచ్చిన సమాచారం మేరకు బుధవారం చిలకపాలెం- పొందూరు రహదారి వద్ద వాహనాల తనిఖీ చేశాం. ఈ క్రమంలో డీఎల్ 4సీ ఎన్‌ఈ 8246 నెంబర్ గల కారులో సుమారు 40 ప్యాకెట్లలో 209 కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించాం. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించగా.. వారిని వెంబండించి అదుపులోకి తీసుకున్నాం. ఎచ్చెర్ల పోలీసుస్టేషన్‌లో విచారణ చేపట్టాం. ఆ ఇద్దరూ ఉత్తరప్రదేశ్‌లోని గజియాబాద్‌కు చెందిన సునీల్, మీరట్‌కు చెందిన విశాల్‌గా గుర్తించాం. వీరిద్దరూ కొరాపుట్ జిల్లా లంపటాపుట్ గ్రామానికి చెందిన సమరామరం అలియాస్ డుంబురు అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేశారు. దీనిని ఉత్తరప్రదేశ్ బాగ్‌పాట్ జిల్లా మీరట్‌కు చెందిన గౌరవ్‌కు అందజేసేందుకు వెళుతున్నారు. సిమిలిగూడ మీదుగా సుంకి చెక్‌పోస్టు వద్దకు తీసుకొని వచ్చి.. సాలూరు నుంచి రామభద్రాపురం, రాజాం మీదుగా చిలకపాలెం జంక్షన్ వద్దకు రాగా.. వాహన తనిఖీల్లో పట్టుబడ్డార'ని ఎస్పీ తెలిపారు. వారిద్దరిని అరెస్టు చేశామని, గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై గతంలో కూడా గంజాయి రవాణా కేసులు నమోదయ్యాయని తెలిపారు. అలాగే ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకునేందుకు తమ బృందం అక్కడకు వెళ్లిందన్నారు. జిల్లాలో పూర్తిస్థాయిలో గంజాయి అక్రమ రవాణాకు కృషి చేస్తున్నామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి, పోలీసులకు పట్టుబడిన గంజాయి.. నిందితులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం

- మొదలవలస చిరంజీవిపై పీడీ యాక్ట్
- చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి హెచ్చరిక

4లో

ఇంటిగ్రేటెడ్ ఆర్టీసీ కాంప్లెక్స్‌గా తీర్చిదిద్దుతాం

- 20 ఏళ్లుగా సమస్య పరిష్కారం కాకపోవడం అన్యాయం: ఎమ్మెల్సీ నాగబాబు

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఇంటిగ్రేటెడ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు తెలిపారు. గతంలో జిల్లా పర్యటనలో అందిన ఫిర్యాదు మేరకు గురువారం ఎమ్మెల్సీ నాగబాబు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ప్రయాణికులు, అధికారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 'శ్రీకాకుళంలో ఆర్టీసీ కాంప్లెక్స్ చిన్నపాటి వర్షానికే నీటమునిగిపోవడం విచారకరం. ఈ సమస్య 20 ఏళ్లుగా ఉన్నా పరిష్కారం కాకపోకవడం అన్యాయం. గత పాలకులు కాంప్లెక్స్ సమస్యను కనీసస్థాయిలో పట్టించుకోలేదు. కాంప్లెక్స్ సమస్యపై కౌన్సిల్‌లో మంత్రులను అడిగా. రోజుకు సుమారు 60వేలమంది ప్రయాణిస్తున్నారని, వర్షాకాలం వస్తే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, కనీసం బస్టాండ్‌ను ఎత్తు చేస్తే సరిపోతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ బస్టాండ్‌గా మారిస్తే ఇప్పుడున్న 25 ఫ్లాట్‌ఫారాల నుంచి 45 ఫ్లాట్‌ఫారాలుగా మార్చవచ్చు. ఆర్టీసీకి కమర్షియల్‌గా ఆదాయం మరింత పెరుగుతుంది. ఈ వియయంపై త్వరలో మంత్రులతో చర్చించి సమస్యను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుంది. దీనిపై చాలా ప్రతిపాదనలు ఉన్నాయి. స్త్రీ శక్తి పథకం ద్వారా బస్సుల్లో పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు చేపడతామ'ని తెలిపారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, నియోజకవర్గ ఇన్‌చార్జిలు గేదెల చైతన్య, పేడాడ రామ్మోహన్, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిలిచిన మురుగునీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

ఏదీ ట్రామా..కేర్?



- జిల్లాలో సుదీర్ఘ జాతీయ రహదారి
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- బాధితులకు సక్రమంగా అందని సేవలు
- నేడు వరల్డ్ ట్రామా డే

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుదీర్ఘ జాతీయ రహదారి ఉంది. రణస్థలం మండలం పైడిభీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకు 197 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. పైడిభీమవరం నుంచి నరసన్నపేట వరకు 54 కిలోమీటర్లు ఆరు లైన్లు... నరసన్నపేట నుంచి ఇచ్ఛాపురం వరకు 137 కిలోమీటర్లు నాలుగు లైన్ల రహదారి ఉంది. రహదారులు ఎంతగా విస్తరించినా జిల్లాలో హైవేపై ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు క్షతగాత్రులవుతున్నారు. సకాలంలో వైద్యం అందక ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు ప్రమాద బాధితుల కోసం 2009లో అప్పటి ప్రభుత్వం జిల్లాలో రెండు ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేసింది. శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి, టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వీటిని ఏర్పాటు చేసింది. సుదీర్ఘ జాతీయ రహదారి ఉన్న జిల్లాలో ఈ రెండు సెంటర్లు ఏమూలకూ చాలవు. అంతే కాదు... పేరుకే ఈ రెండు సెంటర్లు... కానీ రెండు చోట్లా వసతులు అంతంతమాత్రమే. ఆపై సిబ్బంది కొరత కూడా అధికంగా ఉంది.

రిమ్స్‌లో సమస్యలెన్నో..

జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఉన్న ట్రామా కేర్ సెంటర్ సమస్యలతో సతమతమవుతోంది. వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తుంది. సరిపడా వైద్య పరికరాలు, బెడ్లు లేవు. సర్జరీలకు ఆపరేషన్ థియేటర్ కూడా అందుబాటులో లేదు. కొన్ని కేసులను విశాఖపట్నానికి రిఫర్ చేస్తున్నారు. ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసి 12 ఏళ్లు దాటి నా సిబ్బంది నియామకాలు, అవసరమైన ప్రత్యేక సదుపాయాలు కల్పించలేదు. నిజానికి రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి ట్రామాకేర్ సెంటర్‌లో వైద్యసేవలను అందిస్తారు. ఇది ఒక ప్రత్యేక విభాగంగా పనిచేస్తుంది. దీనిని పర్యవేక్షించేందుకు ఒక నోడల్ అధికారి కూడా ఉండాలి. శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలోని ట్రామా కేర్‌కు సంబంధించి ఐదుగురు సీఎంవోలు, ఇద్దరు జనరల్ సర్జన్లు, ఇద్దరు ఎముకల వైద్య శస్త్ర చికిత్స నిపుణులు, న్యూరో శస్త్రచికిత్స వైద్యులు ఇద్దరు, మత్తు వైద్య నిపుణులు ముగ్గురు ఉండాలి. కానీ ఇక్కడ అన్ని పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. 21 మంది నర్సింగ్ సిబ్బందికి ప్రస్తుతం ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారు. మిగిలిన 19 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఎంఎన్‌వోలు, వార్డు బాయ్స్ 24 మంది వరకు ఉండాలి. కానీ కేవలం ఇద్దరే పని చేస్తున్నారు. 12 ఏళ్ల కిందట ట్రామాకేర్ సెంటర్ భవనం కోసం విడుదల చేసిన రూ.5 కోట్ల నిధులను వేరే అవసరాలకు వాడుకున్నారు. దీనితో ప్రత్యేక భవన నిర్మాణ ప్రక్రియ ఆగిపోయింది. దీనితో అత్యవసర సేవలకు వచ్చే వారిని విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తున్నారు.



జిల్లా కేంద్రంలోని సర్వజన ఆసుపత్రి

ప్రాణాలు మూల్యం..

సాధారణంగా ఏదైనా రోడ్డు ప్రమాదం లేదా ప్రకృతి విపత్తు జరిగినప్పుడు సకాలంలో వైద్యం అందిస్తే ప్రాణాలు దక్కుతాయి. కాస్త ఆలస్యమైనా కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోవడంతో పాటు శాశ్వత అంగవైకల్యం వంటి పరిణామాలు సంభవిస్తున్నాయి. ఇప్పటివరకు స్వల్ప రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే వైద్యం చేసే వ్యవస్థ జిల్లాలో ఉంది. పరిస్థితి విషమిస్తే విశాఖపట్నం తరలించాల్సిందే. జిల్లాలోని జాతీయ రహదారిపై సుమారు 40కిపైగా బ్లాక్ స్పాట్స్ ఉన్నాయి. వీటి పరిధిలో రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్యతో పాటు శాశ్వత వైకల్యం పొందుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది. ఇందులో మెజార్టీ బాధితులు సకాలంలో సరైన వైద్యం అందక మరణిస్తున్నారు. ట్రామా కేర్ సెంటర్లు అవసరమైన మేరకు ఉంటే క్షతగాత్రులను ప్రాణాపాయం నుంచి చాలా వరకు కాపాడవచ్చు.

గత మూడేళ్లలో ఇలా...

- 2023లో 511 ప్రమాదాలు జరిగాయి. 109 మంది చనిపోయారు. 156 మంది క్షతగాత్రులయ్యారు.
- 2024లో 654 ప్రమాదాలు జరిగాయి. 98 మంది మరణించారు. 216 మంది క్షతగాత్రులయ్యారు.
- 2025లో ఇప్పటివరకు 221 ప్రమాదాలు సంభవించాయి. 49 మంది మృత్యువాత పడ్డారు. 174 మంది క్షతగాత్రులయ్యారు.

నమో..జోష్



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...





మోదీతో చంద్రబాబు, పవన్





'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)





శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ



సభలో ఉప్పొంగిన దేశభక్తి



సభలో టీడీపీ మహిళా నేతలు





పొలాల వెంబడి పరుగులు

నా అనేవారు లేక.. కడచూపునకు నోచుకోక

(మూడో పేజీ తరువాయి)

యువత విదేశాల్లో ఉపాధి పొందుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

పెరుగుతున్న మోసాలు..

ప్రారంభంలో విదేశీ ఉద్యోగం గిట్టుబాటుగా ఉండేది. స్వదేశీ కంపెనీల్లో పనిచేసేవారిలో నైపుణ్యం చూసి.. సదరు కంపెనీలు తమకు విదేశాల్లో ఉండే పరిశ్రమలకు పంపించేవి. విమాన టిక్కెట్లతోపాటు వీసా, వసతి ఇలా అన్నింటినీ సమకూర్చేవి. దీంతో విదేశాల్లో పని చేయడం లాభసాటిగా ఉండేది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అంతటా బ్రోకర్ వ్యవస్థ నడుస్తోంది. మేన్ పవర్ ఏజెన్సీలు, శిక్షణ సంస్థల మాటున విదేశీ పరిశ్రమల్లో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఇలా ఎంపిక చేసినందుకు కమీషన్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎక్కువగా బోగస్ కంపెనీల పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఒక్కసారి విదేశాలకు వెళ్తున్న వారికి అక్కడ కంపెనీ ప్రతినిధులు ముఖం చాటేస్తున్నారు. పరిశ్రమల్లో నిర్మాణ పనులని చెప్పి.. పారిశుధ్య పనులు చేసిన సందర్భాలు సైతం ఉన్నాయి. ఇక్కడ ఇంటర్వ్యూలో జరిగిన ఒప్పందం ప్రకారం జీతాలు చెల్లించరు. సౌకర్యాలు కల్పించకపోవడంతో జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఏటా పదుల సంఖ్యలో ఉద్యోగాల పేరిట మోసాలు జరుగుతుంటాయి. చివరకు గ్రామాలకే నేరుగా బ్రోకర్లు వచ్చేస్తున్నారు. విదేశీ ఉద్యోగాల పేరిట వల విసురుతున్నారు. పత్రికల్లో ఆసక్తికర ప్రకటనలు చేస్తున్నారు. మండల కేంద్రాల్లో ఇంటర్వ్యూలు చేస్తున్నారు. అయితే ఇందులో సైతం చాలావరకూ బోగస్‌గానే తేలుతోంది.

ఆ సమయంలో నరకయాతన..

విదేశాల్లో వాతావరణ పరిస్థితులు అనుకూలించక చాలా మంది మృత్యువాత పడుతుంటారు. అక్కడ పరిశ్రమల్లో కనీస భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాల బారినపడుతుంటారు. చాలా మంది చనిపోతుంటారు. మరికొందరు క్షతగాత్రులుగా మిగులుతుంటారు. అటువంటి సమయంలో మృతదేహాలను స్వస్థలాలకు తెప్పించడం కత్తిమీద సాములా మారుతుంది. అక్కడ నిబంధనలు అడ్డంకిగా మారుతాయి. అటువంటి సమయంలో మృతదేహాల కోసం బాధిత కుటుంబ సభ్యులు రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తుంది. విదేశాలకు వెళుతున్న వారు అనారోగ్యాలకు ఎక్కువగా గురవుతారు. సమయానికి భోజనం సరైనది ఉండకపోవడం, కుటుంబసభ్యులు దగ్గరగా ఉండకపోవడంతో ఎక్కువ మంది ఆందోళనకు గురవుతున్నారు. అనారోగ్యం బారినపడతారు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఎన్ని బాధలైనా కొందరు ఓర్చుకుంటారు. ఈ క్రమంలోనే ఒత్తిడికి గురై మృత్యువాత పడుతుంటారు. కానీ, వారి మృతదేహాలు రప్పించే విషయంలో కంపెనీలతోపాటు ఏజెంట్లు ముఖం చాటేస్తున్నారు. దీంతో బాధిత కుటుంబాలు అతి కష్టమ్మీద రప్పిస్తున్నాయి. కొన్నిసార్లు అక్కడే అంత్య క్రియలు నిర్వహించిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

డీజే.. అలజడి

(మూడో పేజీ తరువాయి)

మార్గదర్శకాలు మేరకు పారిశ్రామిక ప్రాంతాల్లో పగలు 75 డెసిబుల్స్, రాత్రి సమయంలో 70 డెసిబుల్స్‌కు శబ్దాలు మించరాదు. వాణిజ్య సముదాయాలు ఉన్న ప్రాంతాల్లో పగలు 65 డెసిబుల్స్, రాత్రి 55 డెసిబుల్స్ మధ్య ఉండాలి. నివాస ప్రాంతాల్లో పగలు 55 డెసిబుల్స్, రాత్రి 45 డెసిబుల్స్, సైలెన్స్ జోన్‌లో 40 డెసిబుల్స్ మించరాదు. కానీ డీజేలు ద్వారా 150 నుంచి 200 డెసిబుల్స్ వరకు శబ్దాలు వస్తాయి. 85 డెసిబుల్స్ మించి శబ్దాలు వింటే ప్రజలకు అనర్థాలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. నివాస ప్రాంతాల్లో 100 డెసిబుల్స్ దాటితే పాత భవనాలు కూలే ప్రమాదం ఉందని ఇంజనీరింగ్ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అధిక శబ్దాల ప్రకంపనలతో భవనాలు బీటలు వారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. పరిమితికి మించిన శబ్దాలు పనికిరాదని హెచ్చరిస్తున్నారు.

నాడీ వ్యవస్థపై ప్రభావం



మనిషి మెదడు 85 డెసిబుల్స్ వరకు మాత్రమే శబ్దాలను గరిష్టంగా గ్రహించగలదు. అధిక ధ్వనులతో నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. దీంతో బ్రెయిన్‌స్ట్రోక్ ఎక్కువగా వస్తుంది. పిల్లల్లో అయితే వినికిడి సమస్య ఏర్పడుతుంది. వృద్ధులు డీజే సౌండ్స్‌కు దూరంగా ఉండాలి. మానసిక వైకల్యం కూడా కొందరిలో ఏర్పడే అవకాశం ఉంటుంది.

- బి.నవీన్, చిన్న పిల్లలు వైద్యనిపుణుడు, కొటబొమ్మాళి సామాజిక ఆసుపత్రి

అనుమతి తప్పనిసరి



పండుగలు, ఉత్సవాలు సమయంలో నాలుగు రోజులు ముందుగా పోలీసులు అనుమతి తీసుకోవాలని పదేపదే చెబుతున్నాం. అధిక శబ్దాలు చేస్తే చట్టరీత్యా నేరం. పోలీసులు అనుమతులు లేకుండా ఎటువంటి ఊరేగింపులు చేయరాదు.

లక్ష్మణరావు, డీఎస్పీ, టెక్కలి

శబ్దకాలుష్యంతో హాని



వాతావరణంలో శబ్దకాలుష్యంతో ప్రతీ జీవరాశికి నష్టం కలుగుతుంది. 75 డెసిబుల్స్ మించి శబ్దాలు చేయరాదు. 75 డెసిబుల్స్ శబ్దాలతో వాతావరణంలో మార్పులు సంబవించి అనేక అనర్థాలు ఏర్పడతాయి. శిథిలమైన భవనాలు, వంతెనలు, పెద్దపెద్ద భవనాలు వద్ద డీజే సౌండ్ ఎటువంటి పరిస్థితిల్లో పెట్టరాదు.

- హరీష్, ఏఈ, కాలుష్యనియంత్రణ బోర్డు, శ్రీకాకుళం

సచివాలయ ఉద్యోగులకు శుభవార్త

(మూడో పేజీ తరువాయి)

ఉన్నాయి. మహిళాపోలీస్, డిజిటల్ అసిసెంట్ వెల్ఫేర్‌కు మాత్రం లేవు. దీంతో వారికి ఎటువంటి పదోన్నతులు ఇస్తారో చూడాలి.

- అలాగే సచివాలయ పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎంలకు గ్రేడ్-2గా పదోన్నతి ఇవ్వాల్సి ఉంది. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు మినహా మిగతా జిల్లాల్లో ఇప్పటికే పదోన్నతి కల్పించారు. జిల్లాలో సుమారు 150 మంది ఏఎన్ఎంలు పదోన్నతి కోసం ఎదురు చూస్తున్నారు.

భవనం పోర్టికో వ్యవహారంపై విచారణ

- ప్రభుత్వానికి సమగ్ర నివేదిక: తహసీల్దార్

నరసన్నపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణంలోని భవానీపురంలో బుధవారం రాత్రి నందెన్న ఉత్సవాల్లో డీజే శబ్దాలకు భవన పోర్టికో కూలిపోవడంపై అధికారులు విచారణ నిర్వహించారు. ఈ ఘటనలో ఏడుగురు తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. శిథిలావస్థకు చేరిన భవనం పోర్టికో కూలిన ఘటనపై కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి, ఆర్అండ్‌బీ అధికారులు సంయుక్తంగా విచారణ నిర్వహించారు. టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. భవనం నిర్మాణం ఎప్పుడు జరిగింది, నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. సమగ్ర నివేదిన తయారుచేసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావు, కాలుష్యనియంత్ర మండలి ఏఈ హరిష్, పంచాయతీ ఈవో ద్రాక్షాయిణి, ఎస్ఐ దుర్గాప్రసాద్, క్లూస్‌టీఎం, ఇంటలిజెన్స్ వర్గాలు ఘటన ప్రాంతాన్ని పరిశీలించాయి.

క్షత్రగాత్రులకు పరామర్శ

భవానీపురంలో భవనం పోర్టికో కూలిపోయిన సంఘటనలో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన గురువారం పరామర్శించారు. శ్రీకాకుళం, నరసన్నపేటలలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పూర్ణ, చిరంజీవి, రాధ, సంతోష్‌లతో మాట్లాడారు. బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే భవానీపురంలో సంఘటన జరిగిన ప్రాంతాన్ని స్థానికులతో కలిసి పరిశీలించారు. అలాగే బాధితులకు వైసీపీ నాయకుడు ధర్మాన కృష్ణచైతన్య పరామర్శించారు.



శ్రీకాకుళం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం

- మొదలవలస చిరంజీవిపై పీడీయాక్ట్
- ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చట్టాన్ని తరచూ ఉల్లంఘిస్తూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, వారిపై పీడీయాక్ట్‌లు నమోదు చేసేందుకైనా వెనుకాడబోమని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన మొదలవలస చిరంజీవి అనే వ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటుపడి, ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తూ శాంతిభద్రతలకు హాని కలిగిస్తున్నందున పీడీయాక్ట్ నమోదు చేశామని వెల్లడించారు. గత రెండేళ్లలో నిరంతరం గొడవలు సృష్టించడంతో ఆయనపై 14 కేసులు నమోదయ్యాయని చెప్పారు. చిరంజీవి ప్రవర్తన సమాజానికి హానికరంగా మారుతున్నందున నేరాల నియంత్రణకు చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా పీడీ యాక్ట్ అమలు చేయాలని ఎచ్చెర్ల పోలీసులు జిల్లా కార్యాలయానికి ప్రతిపాదనలు చేశారని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ప్రతిపాదనలు పంపామని ఎస్పీ చెప్పారు. నిందితుడు మొదలవలస చిరంజీవిపై ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే రౌడీషీట్ ఉందన్నారు. చిరంజీవిని విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించామని ఎస్పీ వెల్లడించారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

శాంతిభద్రతకు ఎవరైనా విఘాతం కలిగించినా, చైన్‌స్నాచింగ్, దోపిడీ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, భూ దురాక్రమణలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. అటువంటి వారిని గుర్తించి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని అన్నారు. ముందుగా రౌడీ షీట్లు తెరిచి చూస్తామని, అప్పటికీ వారిలో మార్పు రాకపోతే పీడీయాక్ట్ ప్రయోగిస్తామని ఎస్పీ తెలిపారు. నేరచరిత్ర ఉన్న వ్యక్తులు, వివిధ క్రిమినల్ కేసుల్లో అరెస్టయిన నిందితులపై నిరంతరం నిఘా ఉంటుందని తెలిపారు.

ఎమ్మెల్సీ నాగబాబును కలిసిన ఎస్పీ

శాసనమండలి సభ్యులు కొణిదెల నాగబాబును ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎమ్మెల్సీ నాగబాబు శ్రీకాకుళం నగరంలో పర్యటన సందర్భంగా ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సందర్శించిన అనంతరం ఆర్ అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి జిల్లాలోని వివిధ అంశాలపై నాగబాబుతో చర్చించారు.





ఆకట్టుకున్న భక్తప్రహ్లాద



భక్త ప్రహ్లాద నృత్య రూపకంలో...

నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో జరుగుతున్న జీఎస్టీ వారోత్సవాల్లో గురువారం శ్రీకాకుళానికి చెందిన తన్మయి కూచిపూడి నృత్య బృందం ప్రదర్శించిన భక్తప్రహ్లాద నృత్యరూపకం ఆకట్టుకుంది. దీంతో పాటు రామాయణ, భారత, భాగవతాల్లోని వివిధ ముఖ్య ఘట్టాలను నృత్య రూపకంగా ప్రదర్శించారు. కళాకారుల ప్రతిభకు ప్రేక్షకులు ముగ్ధులయ్యారు.

- అరసవల్లి



మహిషాసుర మర్దినిగా..

అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా పనిచేయండి: విప్


సమావేశంలో మాట్లాడుతున్న విప్ అశోక్

కంచిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక ఏఎంసీ కార్యాలయ ఆవరణలో సోంపేట ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పోషణ మాసోత్సవాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రజలకు నిజమైన సేవ చేసే ప్రభుత్వాలను అందరూ కోరుకోవాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో న్యాయమైన సమస్యల పరిష్కారానికి రోడ్లెక్కాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీ కార్యకర్తలకు అన్నిరకాల ప్రభుత్వ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. బాల్యవివాహాలు అరికట్టేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం ఐదుగురు గర్భిణీలకు సీమంతాలు, ఒక విద్యార్థికి అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విప్‌కు ఐసీడీఎస్ సిబ్బంది దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఈవో వి.తిరుమలరావు, సీడీపీవో కె.వసుందరాదేవి, కూటమి నాయకులు మాదిన రామారావు, బంగారు కురయ్య, పైల రామారావు, పురుషోత్తం రెడ్డి, మద్దిల నాగేశ్వరరావు, జీకే నాయుడు, సానా షణ్ముఖరావు, మఠ్రిపాటి పూర్ణచంద్రుడు, టీవీ రమణ, బి.అప్పారావు, సూపర్‌వైజర్లు లక్ష్మి, ఈశ్వరి, ధనలక్ష్మి, నాగలక్ష్మి, మంగమ్మ, సుశీల, నాగమణి, శాంతి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి


వృద్ధునితో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గృహాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన స్థానిక శాంతా కల్యాణ్ అనురాగ నిలయాన్ని సందర్శించారు. అక్కడి వంటగదిని పరిశీలించి ...రేషన్ సరుకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు ఫిల్టర్, బ్యాటరీ మారుస్తున్నారా లేదా అని ఆరా తీశారు. వృద్ధుల గదిని పరిశీలించి... వారి ఆశీస్సులు అందుకున్నారు. ఒకే టీవీ ఉండడంతో...మిగిలినవి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లైట్లు వెలగడం లేదని సిబ్బంది తెలుపగా, వెంటనే విద్యుత్ ఏఈకి ఫోన్ చేసి... సాయంత్రానికి లైట్లు వెలిగేలా చూడాలని ఆదేశించారు.

ఆదిత్యుని ఆలయానికి రూ.లక్ష విరాళం

అరసవల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత అయిన అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని శ్రీకాకుళం నగరంలోని కొన్నవీధికి చెందిన పెంటయ్య, అన్నపూర్ణ దంపతులు గురువారం దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.వెంకటరమణకు అందజేశారు. వారిని అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి ప్రసాదాలు, జ్ఞాపికను ఆలయ సూపరింటెండెంట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇప్పిలి సాందీపశర్మ, సాంబమూర్తి, జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో గుండె పదిలం


సీపీఆర్ పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో ఎంతోమంది గుండెపోటుతో మరణిస్తున్నారని.. సీపీఆర్ చికిత్స అందిస్తే మరణాల సంఖ్య తగ్గుతుందని జెమ్స్ వైద్య కళాశాల అనస్థీషియా విభాగాధిపతి డా.దివిజి శంకరరావు తెలిపారు. ప్రతి ఒక్కరు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. స్థానిక సన్‌డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు కార్డియాక్ అరెస్టు, తక్షణ సాయంపై జెమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెమ్స్ వైద్య కళాశాల అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్, స్రవంతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విధిగా స్టడీఅవర్స్ నిర్వహించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

పొందూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో ప్రతి ఉపాధ్యాయుడికీ వారంలో 30 పీరియడ్లు ఉండేలా హెచ్ఎంలు చూడాలని, స్టడీఅవర్స్‌ను విధిగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి రవికుమార్ స్పష్టం చేశారు. కింతలి జెడ్పీ ఉన్నత పాఠశాల, తాడివ లస ఉన్నత పాఠశాలలను గురువారం పరిశీలించారు. పరీక్షలలో ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు గ్రేడ్‌లు నిర్ణయించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. స్టడీఅవర్స్‌కు హాజరు కాని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని హెచ్ఎం కంఠయ్యను ఆదేశించారు. అనంతరం పాఠశాలలో సమస్యలను, ఉపాధాయుల తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. డీఈవోతో పాటు డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి ఉన్నారు.

నేడు దివ్యాంగులకు గ్రీవెన్స్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి నెల మూడో శుక్రవారం దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్ 'స్వాభిమాన్ 'ను ఈ నెల 17న స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు దివ్యాంగుల శాఖ ఏడీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఉపశమనం


మాట్లాడుతున్న ఎంవీఐ గోవిందరాజు

ఇచ్ఛాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గించడంతో సామన్య ప్రజలకు ఉపశమనం కలిగిందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.గోవిందరాజు అన్నారు. గురువారం జీఎస్టీపై ఆటోలు, ట్యాక్సీలతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ జీఎస్టీ 2.0తో సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పన్నులు తగ్గడంతో వాహనాల ధరలు కూడా బాగా తగ్గుముఖం పట్టాయని అన్నారు. జీఎస్టీ తగ్గడం తో ట్రాన్స్‌పోర్ట్, కేటరింగ్, ఆటోమొబైల్ రెంటల్స్‌కు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు. అనంతరం బస్టాండ్ జంక్షన్ ఎర్రన్న కూడలి నుంచి మార్కెట్ మీదుగా ఎంవీఐ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పత్రి తవిటయ్య, ఎస్.కోటి, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ, కొండా శంకర్‌రెడ్డి, రెయ్యి జానకిరావు, నందికి జాని, గిన్ని వెంకటరమణ, ఆశి లీలారాణి, ఆశి మోహన్, డి.శ్రీను, జన్నెల సంతు, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది నానాజీ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత ఏపీ మోడల్ స్కూల్


బహుమతిని అందుకుంటున్న మోడల్ స్కూల్ విద్యార్థులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో గత తొమ్మిది రోజుల నుంచి జరుగుతున్న హరి కేశవ మోమోరియల్ క్రికెట్ టోర్నమెంటు విజేతగా పురుషోత్తమపురం ఏపీ మోడల్ జట్టు నిలిచింది. ఈ పోటీలలో 26 జట్లు పాల్గొన్నాయి. గురువారం ఫైనల్ పోటీ శ్రీ చైతన్య1 శ్రీకాకుళం, ఏపీ మోడల్ స్కూల్ పురుషోత్తపురం మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీ చైతన్య జట్టు 66 పరుగులకు ఆలౌట్ అయింది. మోడల్ స్కూల్ జట్టు మూడు వికెట్ల నష్టానికి విజయానికి కావల్సిన పరుగులు సాధించారు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షులు పుల్లెల శాస్త్రి, రామకృష్ణ, ప్రసన్న కుమార్ విజేతలకు బహుమ తులు ప్రదానం చేశారు.

'నారీశక్తి'పై అవగాహన

గార, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వమరవల్లిలోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం 'నారీశక్తి' కార్యక్రమంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళా రక్షణ చట్టం, పోక్సో చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సీహెచ్ గంగరాజు సూచించారు.

భారీ వాహనంతో స్తంభించిన ట్రాఫిక్


నిలిచిన వాహనాలు

ఆమదాలవలస, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస- పాలకొండ రహదారిపై గురువారం భారీ వాహనం ప్రయాణించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విశాఖపట్నం పోర్టు నుంచి ఒడిశాలోని అంగూల్ ప్రాంతానికి వెళుతున్న ఈ భారీ వాహనంపై ఎత్తయిన యంత్ర పరికరాలు ఉండడంతో రహదారిపై విద్యుత్ వైర్లు, చెట్లు, వంతెనలు వంటి ఇబ్బందులు తప్పించి మెల్లగా ప్రయాణం సాగించింది. దీంతో పట్టణంలోని ఫ్లైఓవర్ దిగువన ఒక్కసారిగా రద్దీ ఏర్పడింది. వాహనాలు చాలాసేపు నిలిచిపోయాయి.

మలుపులలో పొదల తొలగింపు

పొందూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారిన చిలకపాలెం - పొందూరు రాష్ట్ర రహదారిలో ప్రమాదకర మలుపుల వద్ద పెరిగిన పొదలను స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ పర్యవేక్షణలో తొలగించారు. మలుపుల వద్ద పెరిగిన పొదల కారణంగా ఎదురెదురు వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై స్థానికులు అధికారులకు, గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జేసీబీ సాయంతో పొదలను, చెట్ల కొమ్మలను తొలగించారు.

ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండండి

లావేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కౌమార దశలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై బాలికలు పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలని స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ ప్రియాంక అన్నారు. గురువారం లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. 275 మంది విద్యార్థినులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల ఏఎంసీ చైర్మన్ నిడిగంట్ల పద్మావతి, మాజీ జడ్పీటీసీ నిడిగంట్ల త్రినాథ్, హెచ్ఎం పి .జగన్నాథరావు, పి.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వజన ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బలగలోని సర్వజన ఆసుపత్రిని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మానసిక రోగుల విభాగాన్ని పరిశీలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగుల సమస్యలను తెలుసుకున్నారు. వసతి సదుపాయాలు, ఆహారం, పరిశుభ్రతపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.చైతన్య, డీఐఈసీ విభాగం నిర్వాహకులు అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన అవసరం అని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. పారా లీగల్ వలంటీర్లకు రెండో రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మామిడి క్రాంతి, అన్నెపు భువనేశ్వరరావు, డాక్టర్ పి.స్వర్ణలత పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల పరిశీలన

కంచిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలను జిల్లా గురుకుల విద్యాసంస్థల సమన్వయకర్త వై.యశోదలక్ష్మి గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్నభోజన పథకంలో మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు, తదితర అంశాలపై కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా చొట్రాయిపురం మండల పరిషత్ పాఠశాలను ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ గురువారం పరిశీలించారు. హెచ్ఎం తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ వనరులతో సంపద సృష్టి

జి.సిగడాం. అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో వనరులపై దృష్టి సారించాలని ..తద్వారా సంపద సృష్టికి కృషి చేయాలని జడ్పీ సీఈవో సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఐవీఆర్ఎస్ కాల్స్‌పై గ్రామాల్లో చైతన్యవంతులను చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణ, రాజశేఖర్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, కంచరాన సూరన్నాయుడు, కూనుబిల్లి కూర్మారావు, మజ్జి కన్నంనాయుడు తదితరులు ఉన్నారు.

ఓటర్ల నమోదులో నిర్లక్ష్యం వద్దు

ఇచ్ఛాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అర్హులందరినీ ఓటర్లుగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలని... నిర్లక్ష్యం వహిస్తే విధుల నుంచి తప్పిస్తామని బీఎల్‌ఓలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.పద్మావతి హెచ్చరించారు. గురువారం తహశీల్దార్ ఎస్.వెంకటరావు అధ్యక్షతన నాలుగు మండలాలకు చెందిన 299 మంది బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లు నమోదు నిష్పక్షపాతంగా చేయాలని ఆదేశించారు. డబుల్ ఎంట్రీలు, మరణించినవారి పేర్లు తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట తహశీల్దార్లు ఎన్.వెంకటరావు, బి .మురళీమోహన్‌రావు, ఎన్.రమేష్, బి.అప్పలస్వామి, ఎన్నికల డీటీ శ్రీహరి, బిఎల్‌ఓలు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

మురికి కూపాల్లా హాస్టళ్లు

అరసవల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లు మురికి కూపాల్లా తయారయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లను సీపీఎం ప్రతినిధి బృందంతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.గోవర్ధనరావు, పి.సుధాకర్, కె.సూరయ్య, ఎల్.మహేష్, వెంకట్ పాల్గొన్నారు.

బాణసంచా స్వాధీనం

శ్రీకాకుళం క్రైమ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బలగమెట్టు వద్ద బరాటం నాగరాజు అనే వ్యక్తి ఇంట్లో అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సరుకు విలువ రూ.50 వేలు ఉంటుందని టూ టౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గోడ కూల్చిన ఘటనలో ఆరుగురిపై కేసు

శ్రీకాకుళం క్రైమ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద రక్షణ గోడ కూల్చి వేశారని మహిళ ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే నగరానికి చెందిన పూడి ధనలక్ష్మి అనే మహిళకు డే అండ్ నైట్ బ్రిడ్జి వద్ద 333 గజాల స్థలం ఉంది. అక్కడ కొందరు ఆటోలను పార్కింగ్ చేయగా... ఆ మహిళ వాటిని ఖాళీ చేయించి రక్షణ గోడ నిర్మించింది. ఆ గోడను ఆరుగురు ఆటో డ్రైవర్లు కూల్చి వేశారంటూ ఆమె ఫిర్యాదుచేసింది. దీంతో కేసు నమోదు చేసినట్టు సీఐ ఈశ్వరరావు తెలిపారు.

శివారు ప్రాంతాల్లో చెత్త డంప్



కేదారిపురం శివారులో చెత్తను డంప్‌చేసిన దృశ్యం

● వర్షాలకు కుళ్లి దుర్వాసన వెలువడుతుండడంతో అవస్థలు ● ఇదీ కేదారిపురంలో రోడ్లకు ఇరువైపులా పరిస్థితి

పలాసరూరల్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేదారిపురం పంచాయతీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో గల శివారుల్లో రోడ్లకు ఇరువైపులా చెత్తను డంప్ చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త కుళ్లుతుండడంతో దుర్వాసన వెలువడుతోందని వాహనచోదకులు వాపోతున్నారు. పలు పంచాయతీల్లో డంపింగ్‌యార్డులు, చెత్త సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేయలేదు. దీంతో సేకరిస్తున్న చెత్తను పంచాయతీ సిబ్బంది శివారు ప్రాంతాల్లో గల రోడ్ల పక్కన వేయాల్సి వస్తోంది. కేదారిపురం తదితర పంచాయతీల్లో తడిచెత్త, పొడిచెత్త వేసేందుకు స్థలాలు కేటాయించేలేదు. ఇప్పటికైనా పంచాయతీ పరిధిలో సేకరించే చెత్త వేయడానికి ప్రత్యేక స్థలం కేటాయించి, రోడ్ల పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

వేర్వేరు చోట్ల రైలు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రైలు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఈ మేరకు ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

పలాస రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-2పై..



మృతిచెందిన వ్యక్తిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన దృశ్యం

పలాస, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): పలాస రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-2 వద్ద గురువారం 45 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందినట్లు ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. నాచురంగు ఆఫ్ ఫ్యాంట్, నీలం రంగు టీషర్టు వేసుకున్నాడని, ఆయనకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. మృతుడు రైల్వేపుట్ బ్రిడ్జిపై నుంచి వెళ్తున్నట్లు సీసీ కెమెరాలో రికార్డయ్యాయని తెలిపారు.ఆయన వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. కేసు నమోదుచేసి మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టానికి తరలించామని చెప్పారు.

ఉర్లాం డౌన్‌ట్రాక్‌లో...

నరసన్నపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):ఉర్లాం రైల్వేస్టేషన్ పరిధిలో శ్రీకాకుళం రోడ్డు- ఉర్లాం డౌన్‌ట్రాక్‌లో బుధవారం విశాఖ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. రైల్వేఎస్ఐ మధుసూదనరావు కథనం మేరకు.. గురువారం ఉదయం ట్రాక్‌పరిశీలిస్తున్న రైల్వే సిబ్బంది మృతదేహాన్ని గుర్తించి సమాచారంఇచ్చారు. దీంతో రైల్వేపోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు 45ఏళ్ల వయస్సు గల ఒడిశా వాసిగా గుర్తించారు. ఈ మేరకు మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

పట్టాల మధ్య నడిచి వెళ్తుండగా..

టెక్కలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): టెక్కలికి సమీపంలో గురువారం రైలు ఢీకొని నర్సింగపల్లి గ్రామానికి చెందిన చలపతి(50) మృతి చెందాడు. రైల్వే పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో రైల్వే గేటు నుంచి పట్టాల మధ్య నుంచి కాలినడకన చలపతి వెళ్తున్నాడు. వెనుకనుంచి వస్తున్న రైలును గుర్తించలేకపోయాడు. దీంతో రైలు ఢీకొనడంతో పొదల్లోకి తుల్లిపోవడంతో వల్ల గాయాలైన చలపతిని స్థానికులు ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

అదుపు తప్పి.. డివైడర్‌ను ఢీకొట్టి

● హైవేపై ప్రమాదంలో ద్విచక్రవాహనచోదకుడు మృతి

కవిటి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కవిటి మండలంలోని జమీదారపుట్టుగ గ్రామసమీపంలోగల జాతీయరహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో టెక్కలిలోని ఆది ఆంధ్రావీధికి చెందిన వాడపల్లి శ్రీను(39) మృతిచెందాడు. కవిటి ఎస్ఐ వి.రమణ కథనం మేరకు.. టెక్కలి నుంచి ద్విచక్రవాహనంపై గురువారం శ్రీను ఇచ్ఛాపురం మండలంలోని సంతపేటలో గల బావమరిది ముకేష్ ఇంటికి వెళ్లి తిరిగివస్తున్నాడు.ఈమేరకు జమీదారపుట్టుగ సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన శ్రీనుకు ఇచ్ఛాపురం సీహెచ్‌సీ తరలించారు. వైద్యులు చికిత్స అందజేస్తుండగా మృతిచెందాడు.

వేర్వేరు కేసుల్లో నిందితులకు జైలు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు కేసుల్లో ఐదుగురికి జైలు శిక్ష, ఇద్దరికి రూ.3 వేల వంతున జరిమానా విధిస్తూ సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పినట్టు పోలీసులు గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 13న మొండేటి వీధిలో పేకాట ఆడుతూ పట్టుబడిన ఆరుగురు వ్యక్తులపై శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. వీరిలో గుడ్ల సర్వాజీ, పొట్నూరు సూర్యనారాయణ, వారణాసి సాయికుమార్, అందవరపు రవికుమార్‌లకు నెలరోజుల సాధారణ జైలు శిక్ష విధించగా, గుడ్ల శ్రీధర్, కోరాడ నాగరాజులకు రూ.3వేలు జరిమానా విధించినట్టు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. ఈనెల 15న నగరంలోని ఉమెన్స్ కాలేజీ రోడ్డులో బహిరంగంగా మద్యం తాగి వీరంగం సృష్టించిన తంగివానిపేట గ్రామానికి చెందిన సాధు కృష్ణపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శివరామకృష్ణ నెలరోజులు జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలి


కాశీబుగ్గ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూతపడిన 4,111 ప్రభుత్వం పాఠశాలలు తెరిపించాలని, యూనివర్సిటీలో నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ కోరారు. గురువారం కాశీబుగ్గలోవిద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 22 నుంచి నవంబరు 12 వరకు ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు జరిగే బస్సుయాత్రకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పీపీపీ పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ నిలిపివేయాలని, గిరిజన విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన విద్యార్థుల బతుకులు 20సంవత్సరాలు వెనక్కువెళ్లాయని విమర్శించారు. డిగ్రీ,ఇంజనీరింగ్, పీజీ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందక ఉద్యోగాల లేక ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాయి, సోమేష్, కిరణ్, నితిన్, విజయ్, హరి పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి: ఏడీ

జలుమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు గాను ఈ-పంట నమోదు తప్పనిసరి అని వ్యవసాయశాఖ ఏడీ ఎల్‌వీ మధు తెలిపారు.గురువారం మండలంలోని నగిరికటకం, మర్రివలస గ్రామాల్లో పంటనమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పండిన ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించాలంటే తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. పంట నష్టం జరిగితే బీమా సౌకర్యం వర్తించేందుకు తప్పనిసరిగా పంటనమోదు జరిగి ఉండాలని చెప్పారు. ఈనెల 25 లోగా పంట నమోదు కార్యక్రమం పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో 19,400 ఎకరాల్లో వరిపంట సాగుచేయగా ఇప్పటివరకు 16,700 ఎకరాల్లో పంట నమోదు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏవో కె.రవికుమార్, పలువురు వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

డేటాసెంటర్‌తో ఉపాధి అవకాశాలు

● అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు



ఈశ్వరరావు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):గూగుల్ డేటా సెంటర్ విశాఖపట్నం తీసుకురావడం కూటమి ప్రభుత్వం విజయమని,ఈ విషయంలో యువనేత నారా లోకేష్ కృషి మరువులేనిదని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు తెలిపారు. గురువారం పూండిలోఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆసియాలోనే పెద్దదైన గూగుల్‌డేటా సెంటరు హబ్ విశాఖపట్నానికి రావడంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి మరింత దోహదమవుతుందని చెప్పారు.డేటాసెంటర్‌తో యువతకు మంచి ఉపాధిఅవకాశాలు దొరుకుతాయని తెలిపారు. మైక్రోసాఫ్ట్‌ను నారాచంద్ర బాబునాయుడు తీసుకువచ్చి హైదరాబాద్ అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. రాష్ట్రాలకు దాటి ఆంధ్రప్రదేశ్‌కు గుగుల్ డెటా సెంటర్ రావడం హర్షణీయమన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గర్భస్థ పూర్వ మరియు గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని కమ్యూనిటి హెల్త్ అధికారి సీహెచ్ భాస్కరరావు తెలిపారు.గురువారం లక్ష్మీనర్సుపేటలో పీహెచ్‌సీ వైద్యసిబ్బంది లింగ నిర్ధారణ పరీక్షలక సంబంధించిన అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డి. హర్ష పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే బగ్గు



డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):రైతులకు కూటమి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటోందని, రైతులు రాయితీపై ఇచ్చిన ఆధునిక యంత్రాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి సూచించారు. గురువారం కుసుమపోలవలసలో శ్రీ రామాంజనేయ కిసాన్‌గ్రూప్ సభ్యులకు రాయితీపై మంజూరుచేసిన డ్రోన్ అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో రైతులు గ్రూపుగా ఏర్పడి సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారికి లేదా వ్యవసాయాధికారికి తెలియచేస్తే డ్రోన్‌తో పాటు వ్యవసాయ పరికరాలను రాయితీ ధరలపై అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో బగ్గు అర్చన, ఎంవీనాయుడు, బైరి భాస్కరరావు, తర్రలక్ష్మీనారాయణ, బొర అప్పలరాజు, కూనరాంబాబు, బైరిఅచ్చెంనాయుడు పాల్గొన్నారు.

అన్నివార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు: ఎమ్మెల్యే శిరీష

పలాస,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):అన్నివార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు.గురువారం జంటపట్టణాల్లోని ఐటీఐ-సూదికొండ రహదారికి రూ.23 లక్షల సాధారణ నిధులతో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగామాట్లాడుతూ పట్టణాభివృద్ధిశాఖ కొత్తగా రూ.మూడు కోట్లు ప్రత్యేక గ్రాంట్ కింద మంజూరు చేసిందని, 31 వార్డుల్లోను కాలువలు, రహదారులకు వీటిని కేటాయిస్తున్నామనితెలిపారు.కార్యక్రమంలో మునిసిపల్‌చైర్మన్ బళ్లగిరిబాబు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, ఎం.నరేంద్ర(చిన్ని), దువ్వాడ శ్రీకాంత్, సప్ప నవీన్‌కుమార్, కొత్త సత్యం, ఎ.రామకృష్ణ, సవర రాంబాబు, కమిషనర్ ఎన్.రామారావు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు ముందడుగు వేయాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణారావు

నరసన్నపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): డిగ్రీస్థాయిలో లక్ష్యసాధనకు ముందడుగు వేయాలని జ్ఞానజ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చింతు కృష్ణారావు పిలుపునిచ్చారు. గురువారం నరసన్నపేటలోని ఓ కల్యాణ మండపంలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫ్రెషర్స్ డే, తృతీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ మొదటి సంవత్సరం నుంచే లక్ష్యసాధన కోసం పాటుపడాలని కోరారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి సన్మానించారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సభ్యులు వరుదు ప్రవీణ, ఏవోలు హనుమంతు అప్పారావు, వెలమల సత్యనారాయణ, అసిరినాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రపతి భవన్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు

నందిగాం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):మండలంలోని సైలాడ పంచాయతీకి రెగ్యులర్ ఏఎన్ఎంలేకపోవడంతో ఇబ్బందులపై దేవాడ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గున్న ప్రవీణ్‌కుమార్ రాష్ట్రపతిభవన్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీలోని సైలాడ, దేవాడ, రౌతుపురం, దొడ్లరామచంద్రపురం, బంజీరుపేట గ్రామాల పరిధిలో నాలుగువేలమంది జనాభా ఉన్నారు. ఇక్కడ రెగ్యులర్ ఏఎన్ఎం లేకపోవడంతో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, చిన్నారులకు వ్యాక్సినేషన్ అంశాలకు సంబంధించి సేవలు నోచుకోవడం లేదని తెలిపారు.ఈ మేరకు ఏఎన్ఎంను నియమించాలని కోరారు.ఈ మేరకు రాష్ట్రపతి భవన్ హెల్ప్ లైన్‌డెస్క్ సిబ్బంది స్పందించి వినతిని నమోదుచేశారు. వైద్య,ఆరోగ్యశాఖ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామని ప్రవీణ్‌కుమార్‌కు రశీదు పంపించారు.

జీపీఎస్ పరికరాల పంపిణీ

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):మంచినీళ్లపేటలో 16మంది మత్స్యకారులకు జీపీఎస్ పరికరాలను గురువారం పంపిణీచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుల్ల చిన్నారావు, టీడీపీ నాయకులు ఆకుల పాపారావు పాల్గొన్నారు.

అన్ని రంగాలకు జీఎస్టీ 2.0తో మేలు

● జిల్లాలో పలుచోట్ల రవాణాశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు



కాశీబుగ్గ: జీఎస్టీ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

అన్నిరంగాలకు జీఎస్టీ 2.0తో మేలు జరుగుతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. గురువారం జిల్లాలోని పలుచోట్ల రవాణాశాఖ ఆధ్వర్యంలో జీఎస్టీపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

కాశీబుగ్గ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి):రవాణా, లాజిస్టిక్స్ రంగానికి జీఎస్టీ తగ్గింపు సూపర్‌గిఫ్ట్ అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు.గురువారం జంట పట్టణాల్లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రవాణా,లాజిస్టిక్స్ రంగానికి సూపర్ గిఫ్ట్ ఇచ్చిన కూటమి ప్రభుత్వానికి మద్దతుగా జీఎస్టీపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, పీరుకట్ల విఠల్‌రావు, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్,ఎం శ్రీనివాస్‌రావు,సప్ప నవీన్,జోగ మల్లేశ్వరరావు,నరేంద్ర పాల్గొన్నారు.

● నరసన్నపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వాహనాలపై జీఎస్టీ 2.0 సంస్కరణల్లో భాగంగా పన్ను తగ్గించిందని నియోజవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన తెలిపారు. సత్యవరం జంక్షన్ వద్ద రవాణాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జీఎస్టీపై అవగాహన ర్యాలీను ప్రారంభించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్టీవో సంజీవరావు, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

● పాతపట్నం అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):పాతపట్నం ఎంపీడీవో కార్యాలయంలో ఎంవీఐ ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గుదలపై అవగాహనకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌కూడలి నుంచి కోర్టుకూడలి వరకూ ఆటోలు, టాక్సీలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ఎం.గోవిందరావు, టీడీపీ మండలాధ్యక్షుడు సైల బాబ్జీ, టీడీపీ పట్టణాధ్యక్షుడు సైలాడ సతీష్ మండలప్రత్యేకాధికారి కరుణాకర్, ఎంపీడీవో రమణమూర్తి పాల్గొన్నారు.

● టెక్కలి,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):ప్రతిఒక్కరూ సూపర్ జీఎస్టీపై అవగాహన కలిగిఉండాలని ఎంవీఐ సంజీవరావు తెలిపారు. టెక్కలిలో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో ఎస్ఐ రాము, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బగాది శేషగిరి, ప్రసాద్‌రెడ్డి, కామేష్ పాల్గొన్నారు.

భూములు ఆక్రమిస్తే పోరాడుతాం

● గిరిజన శక్తి సంక్షేమ సంఘం సభ్యులు

మందస,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గిరిజనుల భూములు ఆక్రమిస్తే పోరాటం తప్పదని గిరిజన శక్తి సంక్షేమసంఘం సభ్యులు తెలిపారు. గురువారం మందస తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన శక్తి సంక్షేమ సంఘం సభ్యులు సవర నర్సింగరావు, సవర హరికృష్ణ మాట్లాడారు. మందస మండలంలోని కొండలోగాం పంచాయతీ చాపరాయికాలనీ గ్రామ పరిధి లో ఈ భూములను ఆక్రమణలకుపాల్పడుతున్నారని వాపోయారు.ఈవిషయంపై రెవెన్యూ అధికారులకు తెలిపినా సరైన స్పందించడంలేదని తెలిపారు. న్యాయం జరగకపోతే పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో గిరిజనశక్తి సంఘ సభ్యులు గోపాల్, మాజీ సర్పంచ్ సవర జగ్గారావు, సవర జ్యోతి, సవర కుమారి, ఏపీ రైతు కూలీ సంఘం కార్యదర్శి కోనేరు రమేష్ పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలి

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రథమ చికిత్సపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు తెలిపారు. నగరంపల్లి హైస్కూల్ విద్యార్థులకు గురువారం జూనియర్ రెడ్‌క్రాస్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం హేమారావు, రెడ్‌క్రాస్ జిల్లాకమిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.అలాగే పూండిగోవిదంపురం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ మేనేజర్ సత్యనారాయణ, కేశవరావు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ చేయాలి

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):బాతుపురం నుంచి చినవంక వరకు గల ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపుల జంగిల్‌క్లియరెన్స్ చేయాలని బాతుపురం సర్పంచ్ బత్తిని లక్ష్మీనారాయణ కోరారు. గురువారం బాతుపురంలో విలేకరులతో మాట్లాడుతూ జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో చెట్లకొమ్మలు, తుప్పలు ముందుకొస్తుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు.ఈవిషయంపై గ్రీవెన్స్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశామని చెప్పారు.

67 మందికి నేత్ర వైద్య పరీక్షలు

జలుమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో విశాఖలోని శంకర ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 67 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 25 మందికి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆరుగురికి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసినట్లు ఆప్తాలమిస్టు రత్నంరాజు తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు కోఆర్డినేటర్ అశ్విని కుమార్ పాల్గొన్నారు.

నివగాంలో వైద్యశిబిరం

కొత్తూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):మండలం నివగాంలో కిమ్స్ ఆసుపత్రి ఆధర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు.ఈసందర్భంగారోగులకు ఉచితంగా పరీక్షలు, తనిఖీలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో మండలపరిషత్ ఉపాధ్యక్షులు ఎల్.తులసీవరప్రసాదరావు, నివగాం ఎంపీటీసీ బిల్లింగి కృష్ణవేణి, సంజీవరావు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

నందిగాం,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ స్కూల్‌టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తమ్మినేని చందనరావు కోరారు. గురువారం జయపురం గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలను సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సందర్శించి మాట్లాడారు. భాషా పండితులను, పీఈటీలను అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం గిరిజన పాఠశాల పని చేస్తున్న వారిని విస్మరించడం తగదన్నారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్తకార్యదర్శి కె.రామిరెడ్డి, బి.రామకృష్ణ, టి.నాగరాజు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సభలో జిల్లా నేతలు



సభా ప్రాంగణంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, విజయనగరం ఎంపీ కలిశెట్టి

శ్రీకాకుళం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో దేశంలో సంస్కరణల విశ్లేషణపై కర్నూలులో ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొన్నారు. జీఎస్టీ తగ్గింపు ద్వారా దేశ ప్రజలకు అందుతున్న లాభాలను ప్రధాని వివరించారు. ఈ సభలో జిల్లాకు చెందిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం, పాతపట్నం, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవిందరావు, ఎన్ .ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలి: డీఎల్‌పీవో

పాతపట్నం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని టెక్కలి డీఎల్‌పీవో ఐవీ రమణ తెలిపారు.గురువారం పాతపట్నంలోని పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆలాంద్రరోడ్‌లోని చెత్తనుంచి సంపద తయారీకేంద్రాన్ని పరిశీలించారు. నిరుపయోగంగా ఉన్న పలుపరికరాలు వినియోగంలోకి తీసుకురాలని ఈవో ఊన రామచంద్రరావుకు సూచించారు.

పంచాయతీ నిధుల వినియోగంపై విచారణ

హిరమండలం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): సుభలయ ఆర్ఆర్‌కాలనీ పంచాయతీలో ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు వినియోగంపై టెక్కలి డీఎల్‌పీవో ఐఈవీ రమణ సచివాలయం-3లో గురువారం విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కె.అప్పలనాయుడు పంచాయతీ నిధులు దుర్వినియోగమయ్యాయని ఇచ్చిన ఫిర్యాదుమేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నామని చెప్పారు. పంచాయతీలో నిర్వహిస్తున్న రికార్డులను స్వాధీనం చేసుకున్నామని, పరిశీలించి పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గోవిందరావు, ఈవో భాస్కరరావు పాల్గొన్నారు.

ఆడదూడలతో పశు సంపద వృద్ధి

కంచిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆడదూడలతో పశుసంపద వృద్ధి చెందుతుందని పశుగణాభివృద్ధి శాఖ ఉపసంచాలకులు సత్యప్రసాద్ అన్నారు. పెద్దకొజ్జిరియాలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో గురువారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడదూడల ఉత్పత్తి పథకానికి సంబంధించిన వివరాలను రైతులకు వివరించారు. ఈ ప్రదర్శనలో ప్రథమ బహుమతిని బాలక దీక్షిత్, ద్వితీయ స్థానం బాలక శశిభూషణ్ దూడలు నిలిచాయి. తృతీయ స్థానంలో బొడ్డ మోహన్‌రావు దూడ నిలిచినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సోంపేట ప్రాంతీయ పశువైద్య సంచాలకులు అప్పలస్వామి, మండల పశువైద్యాధికారిణి టి.శిరీష, రాజేష్, ఈశ్వర్, డేనియల్, సర్పంచ్ ఢిల్లీరావు, టీడీపీనాయకులు కిరణ్, హరిబాబు, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నాగబాబును కలిసిన కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శాసనమండలి సభ్యుడు కొణిదెల నాగబాబు గురువారం శ్రీకాకుళం పర్యటనకు వచ్చారు. తొలుత నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం ఆర్ అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని, పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు జిల్లాలోని వివిధ అంశాలపై చర్చించారు.

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఉమాగౌరి

పాతపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెంబూరు జడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు కార్డియోపల్మనరీ రిసెస్సిటేషన్ (సీపీఆర్)పై ఆయుర్వేద వైద్యాధికారి ఎస్.ఉమాగౌరీ గురువారం అవగాహనకల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా స్పృహతప్పి శ్వాసతీసుకోడంలో ఇబ్బందిపడే పరిస్థితులు ఎదురైనప్పుడు గుండె ఊపిరితిత్తుల మధ్యలో రక్తప్రసరణ సరిగా జరిపించేందుకు, మెదడుకు రక్తప్రసరణ జరిగేలా సీపీఆర్ దోహదపడుతుందని తెలిపారు.

యూకేలో స్కాలర్‌షిప్‌కు బూరగాం విద్యార్థిని ఎంపిక

పాతపట్నం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరగాం గ్రామానికి చెందిన పోలాకి అనూష యునైటెడ్ కింగ్‌డమ్‌లోని చెస్టర్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ హెల్త్ సర్వీసెస్ మేనేజ్‌మెంట్‌లో చదివేందుకు వైస్ చాన్స్‌లర్ స్కాలర్‌షిప్ కింద 6,500 పౌండ్లు (రూ.7.67 లక్షలు) మొదటి సంవత్సరంలో సాధించి సెకండ్ ఇయర్‌లో ప్లేస్‌మెంట్ పొందింది. ఐఈఎల్‌టీఎస్ పరీక్షలో మంచిస్కోర్ సాధించింది. పగలంతా కాలేజీలో రాత్రుళ్లు లండన్ యూనివర్శిటీలో పరిశోధన అప్లికేషన్ల తయారీలో ఆమె గడిపింది. తండ్రి గణపతి రైతుకాగా తల్లి వరలక్ష్మి గృహిణి.ఈమేరకు అనూషకు గ్రామస్థుల తో పాటు పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పలాసరూరల్,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని రాపాక ఝాన్సీ లాంగ్‌జంప్,హైజంప్ 200 మీటర్లలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ సీహెచ్ పద్మలోచన తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఆమె ప్రతిభ చూపడంతో నవంబరు 8,9,10 తేదీల్లో రాష్ట్రస్థాయిలో జరిగే చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందని పేర్కొన్నారు.

టెక్కలిలో జాబ్‌మేళా

టెక్కలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన 28మందికి నియామక ఉత్తర్వులను అందజేసినట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ తెలిపారు. కళాశాలలో జేకేసీ ఆధ్వర్యంలో జరిగిన జాబ్‌మేళాలో దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ వారు జరిపిన ఇంటర్వ్యూలకు 75మంది హాజరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్ జేకేసీ కోఆర్డినేటర్ ల్యూక్ పాల్ పాల్గొన్నారు.

బ్రాహ్మణతర్లాలో అంధకారం

పలాసరూరల్,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణతర్లా ప్రధాన వీధుల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో కొద్దిరోజులుగా అంధకారం నెలకొంది.గ్రామంలోని ఇందిరాకాలనీ ఎంపీయూపీ స్కూల్ ప్రహరీకి ఆనుకొనిఉన్న వీధిలో,చాకలివీధి, పాతపట్నం అమ్మవారి గుడి వైపు వీధి, పెద్దవీధుల్లో వీధిలైట్లు వెలగక సాయంత్రం నుంచి ఉదయంవరకూ చీకటిలోనే మగ్గాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు కార్యదర్శికి తెలిపినా సరైన ఫలితం లేకుండాపోయిందని గ్రామస్థులు వాపోతున్నారు.

కొత్తమ్మతల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కోటబొమ్మాళి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళిలోని కొత్తమ్మతల్లి అమ్మవారి దర్శనానికి గురువారం భక్తులు పోటెత్తారు. వచ్చే మంగళవారం నుంచి కార్తీక మాసం ప్రారంభంకానుండడంతో ఈ గురువారం జిల్లా నలుమూలలనుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండ ఈవో వాకచర్ల రాధాకృష్ణ అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రెండు వేల మందికి ఆలయ అధికారులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మంచాల వెంకటరావు, పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో రక్షణ

హిరమండలం,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):శక్తియాప్‌తో మహిళలకు రక్షణ లభిస్తుందని హిరమండలం ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.గురువారం మండలంలోని కల్లట గ్రామంలో మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సామాజిక మధ్యమాల ద్వారా జరుగుతున్న వేధింపులు,సైబర్ మోసాలపై వివరించారు.